క్లుప్తంగా

అంబేడ్కర్‌కు కళా వందనం



నెల్లూరు(బృందావనం): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు పద్మారత్నం కళాత్మకంగా నివాళులర్పించారు. లాంతర్‌పై వాటర్ కలర్స్‌తో మూడు సెంటీమీటర్ల విస్తీర్ణంలో అంబేడ్కర్ రూపాన్ని తీర్చిదిద్దారు.

పది పరీక్షలకు 367 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 28,063 మంది విద్యార్థులు గురువారం హాజరయ్యారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షను నిర్వహించగా 367 మంది గైర్హాజరయ్యారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లుపై పోలీసుల దాడికి నిరసనగా కోర్టు విధులను నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడారు. బాలాయపల్లి ఎస్సై, కానిస్టేబుళ్లపై పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నేడు

నెల్లూరు (టౌన్): ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని రంగనాయకులపేటలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించనున్నామని తెలిపారు. ఎస్టీయూ సభ్యులు తరలిరావాలని కోరారు.

రేపట్నుంచి సముద్రంలో వేట నిషేధం

నెల్లూరు(సెంట్రల్): సముద్రంలో చేపల వేటను శనివారం నుంచి జూన్ 14 వరకు నిషేధిస్తున్నామని మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్య సంపద వృద్ధి కోసం వేటపై ఏటా నిషేధం విధిస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

నెల్లూరు(క్రైమ్): రైల్వేఫీడర్స్ రోడ్డులోని అగ్నిమాపక జిల్లా కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ శుక్రవారం ప్రారంభించనున్నారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలపై ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లను ఆయన ఆవిష్కరించనున్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది స్మృత్యర్థం నగరంలో ర్యాలీని నిర్వహించనున్నారు. వీఆర్సీ నుంచి అగ్నిమాపక కేంద్రం వరకు 2కే రన్‌ను జరపనున్నారు. అదే విధంగా 15 నుంచి 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

క్యాంపస్ ఎంపికలు రేపు

నెల్లూరు(బారకాసు): కొత్తూరు సమీపంలోని ఎస్సార్ఆర్ ఐటీఐ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను శనివారం నిర్వహించనున్నామని కరస్పాండెంట్ రెహ్మాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకుటూరు సమీపంలోని ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ కంపెనీకి సంబంధించి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని హెవీ వెహికల్స్ యూనిట్లలో పనిచేసేందుకు పలు ఉద్యోగాలను భర్తీ చేయనున్నారని చెప్పారు. ఐటీఐ డీజిల్ మెకానిక్, ఐటీఐ మోటార్ మెకానిక్ ఉద్యోగాలు 15 చొప్పున, ఐటీఐ ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు ఐదు ఉన్నాయని.. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేల వేతనాన్ని అందించనున్నారని పేర్కొన్నారు. వివరాలకు 97039 67967, 89785 44886 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బౌన్సర్ల అవసరం ఎంతో ఉంది

నెల్లూరు(బృందావనం): నగరంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే ప్రముఖుల రక్షణకు బౌన్సర్ల అవసరం ఎంతో ఉందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో వంశీ బౌన్సర్స్ టీమ్ బ్రోచర్లను గురువారం ఆవిష్కరించారు. వంశీ, కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కామేశ్వరి, తదితరులు

నెల్లూరు (వేదాయపాళెం): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గండిపాళెం (బాలురు), నెల్లూరు (మైనార్టీ బాలురు), తుమ్మలపెంట, ఆత్మకూరు (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా కన్వీనర్ కామేశ్వరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను అయ్యప్పగుడి సమీపంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశానికి.. 6, 7, 8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 24లోపు ఆన్‌లైన్లో సమర్పించాలని, ప్రవేశ పరీక్షను మే ఐదున నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా మే 15 నుంచి నేరుగా అడ్మిషన్లను ఇవ్వనున్నామని, వివరాలకు 97018 89873 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వెంకటశేషాచార్యులుకు సత్కారం



నెల్లూరు(బృందావనం): అర్చక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశేషాచార్యులుకు ఆత్మీయ అభినందన సభను బాలాజీనగర్‌లోని త్యాగరాజ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ద్వారా తమిళనాడులోని హోసూరులో వేదిక్ ఆస్ట్రాలజీ, హ్యూమానిటీపై గౌరవ డాక్టరేట్‌ను ఆయన అందుకున్న నేపథ్యంలో మణిశంకర్, సాయిచరణ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. రిషికేశ్ శివానంద ఆశ్రమ స్వామి శుగహరికానంద్, సునీల్‌కుమార్‌స్వామి, ప్రసాదాచార్యులు, మహేష్‌స్వామి, భువనేశ్వరి ప్రసాద్, శ్రీధర్‌శర్మ, వాసుదేవరావు, కోటేశ్వరశర్మ, వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, నాగఫణిశర్మ, శరవణ మహేష్, ఫణికుమార్‌శర్మ, శ్రీనివాసశర్మ, రమేష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్) : పురుగుల మందు తాగి ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీబొమ్మ సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు మండలం రామస్వామిపల్లికి చెందిన తిరుపతిరెడ్డి(45), మనోజ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం నెల్లూరొచ్చి బీవీనగర్‌లో నివాసం ఉంటున్నారు. తిరుపతిరెడ్డి ఆటో నడుపుకొంటుండగా.. మనోజ టిఫిన్ దుకాణాన్ని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన తిరుపతిరెడ్డి సంపాదించిన మొత్తాన్నంతా దానికే వెచ్చించసాగారు. దీంతో కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ విషయమై దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. మద్యం మానేయాలని భర్తను మనోజ ప్రాధేయపడ్డారు. ఆర్థిక ఇబ్బందులూ ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన తిరుపతిరెడ్డి గాంధీబొమ్మ సెంటర్‌లో తన ఆటోలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి బుధవారం పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు భార్య ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు ఆస్పత్రికి గురువారం చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): బైక్‌లు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన హరనాథపురంలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురం ఐదో వీధికి చెందిన హరిప్రసాద్ బైక్‌పై ఇంటి నుంచి నగరంలోకి బుధవారం రాత్రి బయల్దేరారు. ముత్తుకూరు వైపు నుంచి ముగ్గురు యువకులు బుల్లెట్ బైక్‌పై వేగంగా వస్తూ హరిప్రసాద్ బైక్‌ను ఢీకొన్నారు. ఘటనలో హరిప్రసాద్ ఎడమ కాలి పాదం వద్ద తీవ్రగాయమైంది. దీంతో యువకులు బుల్లెట్‌ను అక్కడే వదిలి పరారయ్యారు. చికిత్స నిమిత్తం ఆపోలో హాస్పిటల్‌కు క్షతగాత్రుడ్ని తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైకు తరలించారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధుడు అదృశ్యమయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. అపోలో హాస్పిటల్ సమీపంలోని శ్రామికనగర్‌లో సుబ్బారావు, లలిత దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడికి ఆర్నెల్ల క్రితం వివాహమైంది. మనస్పర్థలు చోటుచేసుకోవడంతో ఇంటి నుంచి కోడలు వెళ్లిపోయారు. ఈ విషయమై సుబ్బారావు, అతని భార్య నడుమ గురువారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సుబ్బారావు ఇంటి నుంచి వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన నాగమహేంద్ర నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. స్నేహితులతో కలిసి ఎంజీబీ మాల్‌కు తన పల్సర్ బైక్‌పై ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటిన వెళ్లారు. శబరి శ్రీరామక్షేత్రం వద్ద బైక్‌ను నిలిపారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహితకు వేధింపులు

నెల్లూరు(క్రైమ్): వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తపై బాలాజీనగర్ పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన ఫాతిమాకు తోటపల్లిగూడూరుకు చెందిన షుకూర్‌తో పెద్దలు 2001లో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుటుంబకలహాల నేపథ్యంలో కాపురాన్ని నగరంలోని వెలగచెట్టు సంఘానికి మార్చారు. ఈ క్రమంలో ఆయన మద్యానికి బానిసయ్యారు. దీంతో దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. దీంతో షుకూర్ భార్య, పిల్లలను వదిలేసి తన స్వగ్రామానికి వెళ్లిపోయారు. నగరంలో పనులు చేసుకొని పిల్లలను ఫాతిమా పోషిస్తున్నారు. భర్తతో కలిసేందుకు పెద్ద మనుషుల ద్వారా పలుమార్లు యత్నించారు. అయినా భర్తలో మార్పు రాకపోవడం, మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో బాలాజీనగర్ ఎస్సై సుమన్‌కు ఫాతిమా ఫిర్యాదు చేశారు. ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన నగరంలోని పోలీస్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పోలీస్ కాలనీలో నివసిస్తున్న సురేష్‌కృష్ణ గుంటూరులో ఉంటూ నాగార్జున యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆయన భార్య జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. ఈ నెల పదో తేదీన ఇంటికి తాళాలు వేసి విశాఖపట్నానికి ఆమె వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలోని రూ.పది వేల నగదు, ఏడు గ్రాముల బంగారు ఆభరణాలు, 30 గ్రాముల వెండి పట్టీలను అపహరించుకెళ్లారు. తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు సురేష్‌కృష్ణకు ఫోన్లో బుధవారం సమాచారం అందించారు. దీంతో నెల్లూరు చేరుకున్న ఆయన చోరీ ఘటనపై దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మల అపహరణ

నెల్లూరు(క్రైమ్): దంపతుల ముసుగులో ఇద్దరు నిందితులు కమ్మలు, జుంకీలను అపహరించుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. చిన్నబజార్‌లోని గర్మీవీధికి చెందిన పవన్‌కుమార్ కాపువీధిలో జ్యువెలరీ షాపును నిర్వహిస్తున్నారు. దంపతుల ముసుగులో ఇద్దరు నిందితులు దుకాణానికి బుధవారం వచ్చారు. బంగారు కమ్మలను చూపాలని వారు కోరగా, ట్రేలో ఉంచి వారికిచ్చారు. అనంతరం వేరే కస్టమర్‌తో మాట్లాడుతుండగా, సుమారు తొమ్మిదిన్నర గ్రాములు కలిగిన తెల్ల రాళ్ల కమ్మలు ఒక జత, జుంకీలు ఒక జతను నిందితులు తస్కరించారు. అనంతరం తమకు కమ్మలు నచ్చలేదని చెప్పి, అక్కడి నుంచి జారుకున్నారు. కొద్దిసేపటికి కమ్మలు, జుంకీల జత లేకపోవడాన్ని యజమాని గుర్తించారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): పండ్ల తాలూకు నగదును హోల్‌సేల్ వ్యాపారికి ఇవ్వకుండా మోసగించిన వ్యక్తిపై నవాబుపేట పోలీసులు చీటింగ్ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంట రోడ్డులోని వీవర్స్ కాలనీకి చెందిన పండ్ల హోల్‌సేల్ వ్యాపారి వినయ్ శేఖర్ పుల్లమసత్రం సమీపంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. రైతుల నుంచి పండ్లను కొనుగోలు చేసి వ్యాపారులకు విక్రయించేవారు. గూడూరుకు చెందిన గోపీ ఈయన వద్ద పండ్లను కొనుగోలు చేసేవారు. అప్పుడప్పుడూ అప్పు పెట్టి వీటిని విక్రయించగా, వచ్చిన మొత్తాన్ని చెల్లించేవారు. ఇటీవల లెక్క చూడగా రూ.2.57 లక్షల మేర గోపీ చెల్లించాల్సి ఉందని తేలింది. నగదును ఇవ్వాలని బాధితుడు కోరినా గోపీ పట్టించుకోలేదు. సరైన సమాధానం చెప్పకుండా ఇబ్బందులకు గురిచేయడంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఇఫ్తార్ విందు



నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని 42వ డివిజన్లో గల కోటమిట్ట అమీనియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన కమిషనర్



నెల్లూరు (అర్బన్): కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వికాస్ మర్మట్ జేసీ కూర్మనాథ్‌ను మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సత్యాగ్రహ దీక్ష రేపు

నెల్లూరు (అర్బన్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ ధోరణిని నిరసిస్తూ పార్టీలకతీతంగా శాంతియుత సత్యాగ్రహ దీక్షను గాంధీబొమ్మ వద్ద శనివారం చేపట్టనున్నామని డాక్టర్ యశోధర పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ జెడ్పీ కాలనీ, గౌతమినగర్ ఫీడర్లలో మరమ్మతులు, నూతన టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమినగర్, జెడ్పీ కాలనీ, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నెల్లూరు(బృందావనం): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థాన నియామక ఉత్తర్వులను అందుకున్న వంశపారంపర్య ధర్మకర్త బాలాజీసింగ్ నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను రాజన్న భవన్‌లో గురువారం కలిశారు. దేవస్థానంలో శనివారం నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. సుభాన్‌సింగ్, కృష్ణసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జగనన్నే మా భవిష్యత్తు – జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని 14వ డివిజన్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు వేపదొరువు, పద్మావతి నగర్ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆత్మీయంగా ఆహ్వానించి జగనన్న స్టిక్కర్లను తమ గృహాలకు అతికించుకున్నారని తెలిపారు.

● మీ మంచి మామయ్య..



నగరంలోని గాంధీ గిరిజన కాలనీలో తన మనవరాలికి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను చూపిస్తూ ఆనందిస్తున్న మహిళ. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు